
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.8 : కనిష్ఠం 24.6







సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

- రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ అధ్యక్షతన బుధవారం రోడ్డు భద్రత జిల్లా కమిటీ సమావేశం జరిగింది. పోలీసు, రవాణా, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. జిల్లా మీదుగా ప్రధాన జాతీయ రహదారులు వెళ్తుండటం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నందున వాటికి ఆస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలను బ్లాక్ స్పాట్‌గా పరిగణిస్తూ ప్రమాదాలకు దారి తీస్తున్న కారణాలను గుర్తించాలన్నారు. పోలీసు, ఆర్‌అండ్‌బీ, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇప్పటికే కొన్ని బ్లాక్ స్పాట్ వద్ద చర్యలు తీసుకున్న ఫలితంగా గత జూన్ నెల నుంచి చూస్తే కొంత వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయని అదనపు కలెక్టర్ తెలిపారు. మూల మలుపులు, కల్వర్టులు, ఎత్తుపల్లాలు, రోడ్డు నిర్మాణం సరిగ్గా లేకపోవడం వంటివి వాటిని సరిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేసేలా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, ఇతర ప్రైవేటు వాహనాల ఆపరేటర్లకు రోడ్డు భద్రత చర్యలు విధిగా పాటించేలా నిబంధనల పట్ల స్పష్టమైన అవగాహన కల్పించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు ఇతర పట్టణాల్లోనూ ముఖ్య కూడళ్ల, ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ప్రధాన రహదారులపై ధాన్యం, మొక్కజొన్నలు ఆరబెడుతుండటం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని దీనిపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. డ్రై ప్లాట్ ఫారాలను విరివిగా మంజూరు చేయాలని కమిటీ సభ్యులు సూచించారు. నగరంలో వాహనాల పార్కింగ్ కోసం అనువైన ప్రదేశాలను గుర్తించాల్సిన ఆవశ్యకత ఉందని సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నియామకాలు సరే..
నిర్వహణ ఎలా?

- జిల్లా వ్యాప్తంగా ఇన్‌చార్జి ఎంఈవోల నియామకం
- నూతన ఎంఈవోలకు స్వాగతం పలుకుతున్న సవాళ్లు
- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ఉపాధ్యాయుల సమస్యలు
- కార్యాలయాలు, సిబ్బంది లేక ప్రశ్నార్థకంగా మారిన నిర్వహణ
- అయోమయంలో నూతన ఇన్‌చార్జి ఎంఈవోలు

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: జిల్లాలో అనేక ఏళ్లుగా పూర్తిస్థాయి మండల విద్యాశాఖ అధికారులు లేక విద్యావ్యవస్థ పూర్తిగా కుంటు పడిపోతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లా వ్యాప్తంగా పాత ప్రతీ ఎంఆర్‌సీ పరిధిలో ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్‌తో పాటు ఒక ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఆఫీస్ సబార్డినెట్ ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ కూడా పూర్తిస్థాయి సిబ్బంది లేరు. దీంతో ఉపాధ్యాయులకు సంబంధించిన పనులన్నీ పెండింగ్‌లో ఉంటున్నాయి. నిజామాబాద్ ఎంఆర్‌పీ పరిధిలో ఒక రెగ్యులర్ కంప్యూటర్ ఆపరేటర్ ఉండగా ముగ్గురు కంప్యూటర్ ఆపరేటర్లు సమగ్ర శిక్షా అభియాన్ నుంచి ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకున్నారు. పాత మండలాల్లో ఏ ఎంఆర్‌సీ పరిధిలో కూడా పూర్తిస్థాయి సిబ్బంది లేరు. దీంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోలకు ఎన్నో సవాళ్లు ఎదురుకానున్నాయి. ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు, కార్యాలయాలు, సరైన సిబ్బంది లేక విధుల నిర్వహణపై నూతన ఇన్‌చార్జి ఎంఈవోలు అయోమయంలో పడ్డారు.

కొరవడిన పర్యవేక్షణ

జిల్లాలో 15ఏళ్లుగా మండల విద్యాశాఖకు అధికారులు లేకపోవడంతో పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. దీంతో క్రమేపి ప్రభుత్వ పాఠశాలలు అంటే విద్యార్థుల్లో ఆసక్తి సన్నగిల్లింది. దీంతో విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈవోల కొరతను తీర్చేందుకు ఆయా మండలాల పరిధిలోని సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి ఎంఈవోలుగా బాధ్యతలు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జిల్లాలో 31 మండలాలకు గాను ప్రస్తుతం ఒకేఒక్క ఎంఈవో రెగ్యులర్ ఉండగా మిగిలిన 30 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించింది. ఇదివరకు ఒక ఎంఈవో నాలుగు నుంచి ఐదు మండలాల ఎంఈవో బాధ్యతలు ఉండేవి. దీంతో పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. ఉపాధ్యాయ సంఘాల నుంచి, విద్యావేత్తల నుంచి వచ్చిన సూచనల మేరకు ప్రభుత్వం, రాష్ట్ర విద్యాశాఖ మండలానికి ఒక పూర్తిస్థాయి ఎంఈవోలను నియమించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కొన్ని మండలాల్లో నోడల్ విద్యాశాఖ అధికారులుగా పనిచేస్తున్న వారికి ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంఈవోలు గా నియమించారు. ఎంఈవోలుగా నియమించిన విద్యాశాఖ ఇంకా పూర్తిస్థాయి పరిపాలన ఉత్తర్వులను మాత్రం ఇవ్వలేదు. దీంతో మండలాల్లో విద్యావనరుల కేంద్రాలను ఏ విధంగా నిర్వహించాలనే విషయంలో స్పష్టత లేకపోవడంతో ఇన్‌చార్జి ఎంఈవోలు సతమతమవుతున్నారు.

ఎంఈవోలు బాధ్యతల స్వీకరణ

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఇన్‌చార్జి ఎంఈవోలు బాధ్యతలు స్వీకరించినప్పటికీ ఇంకా పూర్తిస్థాయిలో పరిపాలన ఉత్తర్వులు లేకపోవడం తో వారు ఎక్కడ విధులు నిర్వహించాలి అనే విషయంలో స్పష్టత లేదు. కొన్ని మండలాల్లో మండల విద్యావనరుల కేంద్రం కూడా అందుబాటులో లేకపోవడంతో వారు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని కొత్త మండలాలకు ఎంఆర్‌సీ భవనాలు కూడా లేకపోవడంతో పాటు సిబ్బంది కూడా లేకపోవడంతో వారంతా పూర్తిస్థాయి ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నారు.

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర విద్యాశాఖ రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ మండలానికి ఒక ఇన్‌చార్జి ఎంఈవోను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో ఎంఈవోలుగా నియమితులైన వారు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా జిల్లాలోని 31 మండలాలకు ఎంఈవోలు నియామకం కాగా అందరూ బాధ్యతలు స్వీకరించినట్లు తెలిసింది. కాగా, నూతనంగా ఎంఈవోలుగా బాధ్యతలు స్వీకరించిన వారిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

కొన్ని మండలాల్లో కానరాని కార్యాలయాలు

జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలాల్లో ఇప్పటికీ మండల విద్యావనరుల కేంద్రాలు లేవు. నిజామాబాద్ మండలం మోపాల్, నిజామాబాద్ రూరల్, నిజామాబాద్ నార్త్, సౌత్‌గా ఏర్పడగా ఇప్పటికీ జిల్లా కేంద్రంలోనే మండల విద్యావనరుల కేంద్రం నిర్వహిస్తున్నారు. గతంలో మండల విద్యావనరుల కేంద్రం సొంత భవనం ఉండగా స్టేడియం నిర్మాణం కోసం దానిని కూల్చివేయగా ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని శంకర్‌భవన్ పాఠశాలలో నాలుగు మండలాలకు సంబంధించిన మండల విద్యావనరుల కేంద్రం కొనసాగుతోంది. ఇప్పుడు విద్యాశాఖ నాలుగు మండలాలకు నలుగురు ఎంఈవోలను నియమించడంతో వారు ఎక్కడి నుంచి విధులు నిర్వహించాలనేది స్పష్టత లేకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. మోపాల్, నిజామాబాద్ రూరల్ మండలాలు కొత్తగా ఏర్పడగా ఆ మండలంలో మండల విద్యావనరుల కేంద్రాలు లేవు. అదేవిధంగా ఆలూరు, డొంకేశ్వర్, ముప్కాల్, మెండోరా, పోతంగల్, సాలూరా, చందూర్ మండలాలు జిల్లాలో నూతనంగా ఏర్పడ్డాయి. ఆ మండలాల్లోనే ఎక్కడ కూడా మండల విద్యావనరుల కేంద్రాలు లేవు. నూతనంగా ఎంఈవోలుగా నియమితులైన వారు ఎక్కడి నుంచి విధులు నిర్వహించాలనేది ఉత్తర్వులో స్పష్టత లేకపోవడంతో వారంతా ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల నుంచే పర్యవేక్షణ చేస్తున్నారు. పూర్తిస్థాయి ఆదేశాలు వచ్చే వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది.

కార్యాలయాల్లో సిబ్బంది కొరత

మండల విద్యావనరుల కేంద్రాలలో ప్రస్తుతం జిల్లాలో ఎక్కడ కూడా పూర్తిస్థాయి సిబ్బంది లేరు. ఎంఈవోలు ఇతర సిబ్బందిని వాడుకొని పనులను నిర్వహిస్తున్నారు. విద్యాశాఖ జిల్లాలోని 33 మండలాలకు ఇన్‌చార్జి ఎంఈవోలను నియమించినప్పటికీ సిబ్బంది సర్దుబాటు ఏ విధంగా చేస్తారు అనే విషయంలో స్పష్టత లేదు. పూర్తిస్థాయి ఉత్తర్వులు వస్తే తప్ప మండల విద్యావనరుల కేంద్రాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.





- పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు (ఫైల్)

మెడికల్ కళాశాలలో 'ఫెస్ట్' వేడుకలు

- వేడుకలను ప్రారంభించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి
- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్య ప్రదర్శన

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25: నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల 'ఎలీగ్జర్ 24 ఫెస్ట్' వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు ఈ వేడుకలు జరుగనున్నాయి. బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఫెస్ట్ టీజర్‌ను లాంచ్ చేసి మెడికల్ స్టాల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల పది సంవత్సరాలల్లో అభివృద్ధి చెందిందని, విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతతో కాలేజీని ముందంజలో ఉంచుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో సైతం కాలేజీని ఉన్నత స్థాయిలో నిలబెట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు మెడికల్ కళాశాల స్థాపన కోసం కృషి చేశానని, ప్రస్తుతం కళాశాలలో స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. అంతేకాకుండా విద్యార్థులకు జిమ్ సైతం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. వేడుకల సందర్భంగా మెడికల్ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శివప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, ప్రొఫెసర్లు నాగమోహన్, జలగం తిరుపతి రావు, కళాశాల సూపరింటెండెంట్ పెద్దోళ్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



టీషర్ట్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

వాహనాల తనిఖీలు ఏవీ!?

- నగరంలో ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు
- కానరాని తనిఖీలు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలు



ఖిల్లా, సెప్టెంబరు 25: నగరంలో ట్రాఫిక్ పోలీసుల వాహనాల తనిఖీలు కానరావడం లేదు. కొంత కాలంగా తనిఖీలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడుపుతూ కాలినడకన వెళ్లే వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇటీవల ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రాంగ్‌రూట్, మైనర్ డ్రైవింగ్‌లను గుర్తించి జరిమానాలు వేశారు. పోలీసు శాఖ, ట్రాఫిక్ పోలీసులు, మోటార్ వాహనాల శాఖ అధికారుల సమన్వయంతో జిల్లా కేంద్రంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. రాంగ్‌రూట్‌లో వెళ్లేవారిపై, సిగ్నల్స్ జంప్ చేసే వారిపై, మైనర్లపై, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపే వారిపై కేసులు పెట్టి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అందుకోసం నగరంలో 18 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే ఈ కార్యక్రమం కొంత కాలంపాటు నిర్వహించినా.. ఆ తర్వాత వాహనాల తనిఖీలు చేపట్టడం మానివేశారు. దీంతో పలువురు వాహనదారులు గతంలో లాగే వాహనాలను విచ్చలవిడిగా నడపడం మొదలు పెట్టారు.

పోలీసు శాఖ ప్రత్యేక డ్రైవ్

రాంగ్‌రూట్ డ్రైవింగ్‌తో పాటు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగేవి. వాటిని నియంత్రించేందుకు పోలీసు శాఖ ఇటీవల ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించి కేసులు నమోదు చేసింది.

వాహనాల కోసం ప్రత్యేక స్థలం ఏర్పాటు

నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకుని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలంలో ఉంచారు. అనంతరం జరిమానాలు చెల్లించిన వారికి ఆ వాహనాన్ని తిరిగి ఇచ్చివేసేవారు. దీంతో ఆ స్థలం పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలతో కిటకిటలాడేవి. కానీ ప్రస్తుతం వాహనాల తనిఖీలు చేపట్టకపోవడంతో ప్రత్యేక స్థలంలో వాహనాల సంఖ్య తగ్గిపోయి బోసిపోయింది.

వాహనాల తనిఖీలు చేపడుతున్నాం..

: వీరయ్య, ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్

సీపీ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేపడుతున్నాం. హెల్మెట్ ధరించని వారికి జరిమానా విధిస్తున్నాం. గతంలో రాంగ్‌రూట్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం చేస్తే శాఖాపరమైన కేసులు తప్పవు.

సిబ్బందిచే ప్రతిజ్ఞ చేపిస్తున్న మున్సిపల్ కమిషనర్



మున్సిపల్ కార్మికులకు వైద్య సేవలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బంది శుభ్రతను పాటించాలని కోరారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు నటరాజ్‌గౌడ్, మహేష్‌కుమార్, ప్రశాంత్, సునీల్‌కుమార్, జవాన్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులచే ప్రతిజ్ఞ

స్వచ్ఛతీ హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులచే నగర పాలక సంస్థ కమిషనర్ స్వచ్ఛతీ హీ సేవ ప్రతిజ్ఞను చేయించారు. నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులందరిని ఒకచోటకి చేర్చి ప్రతిజ్ఞను నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మంద మకరంద్ మాట్లాడుతూ.. స్వచ్ఛతీ హీ సేవ కార్యక్రమంలో ఉద్యోగులందరూ పాల్గొనాలని అన్నారు. నగరంలో వీధులన్నీ శుభ్రంగా ఉంచేలా అధికారులు చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాల్ బాడ్మింటన్ కోచ్‌గా శ్యామ్



సుభాష్‌నగర్, సెప్టెంబరు 25: తెలంగాణ రాష్ట్ర బాల్ బాడ్మింటన్ కోచ్‌గా జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు శ్యామ్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర బాల్ బాడ్మింటన్ అసోసియేషన్ ఉత్తర్వులను జారీ చేసింది. ఈనెల 26 నుంచి 29 వరకు హర్యానా రాష్ట్రం రోతక్‌లో జరిగే 43వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ బాల బాలికల క్రీడా పోటీలకు కోచ్‌గా వ్యవహరించనున్నారు. రాష్ట్ర జట్టుకు కోచ్‌గా నియమించడం పట్ల అసోసియేషన్ అధ్యక్షుడు మానస గణేష్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, సభ్యులు రంజిత్, నర్సయ్య, కిశోర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ ఆధ్వర్యంలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో సానిటేషన్ నిర్వహణ ఓ ఏజెన్సీ ద్వారా ఔట్‌సోర్సింగ్ పద్దతిలో కార్మికులను నియమించుకున్నారని గత రెండేళ్లుగా చట్టప్రకారం కనీస వేతనాలు చెల్లించకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయడం లేదని సెలవులు కూడా ఇవ్వడం లేదని కావున వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అలకనంద, నవనీత, లక్ష్మి, పద్మ, రమా, హేమా, సవిత, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

నేషనల్ కో ఆపరేటివ్ యూనియన్ వార్షిక సమావేశంలో మానాల

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: ఢిల్లీలో బుధవారం జరిగిన నేషనల్ కోఆపరేటివ్ యూనియన్ వార్షిక మహాజన సభలో రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నేషనల్ కోఆపరేటివ్ యూనియన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దిలీప్ సంగానే ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మానాల సహకార సంఘాల్లో పెరిగిపోతున్న నిరాశ నిర్లక్ష్యం అదే విధంగా సహకార సంఘాలకు సభ్యులకు మధ్య ఉన్న భారీ అగాదాన్ని పూడ్చే విధంగా ప్రజలు, రైతులు సహకార సంఘం అంటే మాది అనే అనుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత జాతీయ సంఘానికి ఉందని దానికి రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్‌లు సహకరించినప్పుడే సహకార యూనియన్‌ల మనుగడ సాగుతుందని ఆయన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతు తెలుపుతుందని సహకార సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి సహకార సంఘాలను బలోపేతం చేసేలా మరో జాతీయ ఉద్యమాన్ని తీసుకురావాల్సిన ఆవశ్యకతను ఆయన వివరించారు.

పాఠశాల స్థాయిలోనే వైకల్యాలను గుర్తించాలి

పెర్కిట్, సెప్టెంబరు 25: ప్రతీ విద్యార్థి వివరాలు ప్రశస్త యాప్‌లో పొందుపర్చి పాఠశాల స్థాయిలోనే వైకల్యాలను గుర్తించాలని జిల్లా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్, సీఎంవో పడకంటి శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఎంఈవో రాజగంగారాం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను పరిశీలిస్తూ ఉండాలని, ప్రధానోపాధ్యాయులతో పాటు ఆయా తరగతి ఉపాధ్యాయుల బాధ్యత ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రశస్త యాప్ గురించి శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థుల్లో గుర్తించిన వైకల్యాలను మదింపు చేయడానికి సమగ్రశిక్ష, ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో ఈ యాప్‌ను రూపొందించామని, 1వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ప్రతీ విద్యార్థిని పరిశీలించి రిపోర్టు యాప్‌లో పొందుపర్చాలని అన్నారు. యాప్ ఫెస్ వన్‌లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రిజిష్టర్ చేసుకునే విధానాన్ని స్పెషల్ టీచర్ రామకృష్ణ, ఐఈ ఆర్‌పీలు సునీల్, కిషన్, సురేష్‌లు వివరించారు. ఫెజ్- 2లో దివ్యంగులను నిర్ధారిస్తారని తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం గుర్తించిన 21 వైకల్యాలను పాఠశాల స్థాయిలోని గుర్తించాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్మూర్, ఆలూర్ మండలాల ప్రధానోపాధ్యాయులు, ఆలూర్ ఎంఈవో నరేందర్, పెర్కిట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఆర్మూర్, ఆలూర్ పాఠశాలల సీఆర్‌పీలు సంతోష్, లతలు పాల్గొన్నారు.

‘క్రీడల్లో గెలుపోటములు సహజం’

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 25: క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమని డిచ్‌పల్లి సీఐ మల్లేష్ అన్నారు. జక్రాన్‌పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం రాత్రి మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడల ముగింపు కార్యక్రమం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో సీఐ మల్లేష్ మాటాడుతూ విద్యార్థులకు క్రీడలతో పాటు చదువు ఎంతో ముఖ్యమని, విద్యారంగంలో భవిష్యత్‌లో మంచిగా చదివి ఉన్నతస్థాయిలో స్థిరపడాలన్నారు. అనంతరం కబడ్డీ, ఖోఖో, వాలీబల్, ఇతర క్రీడల్లో గెలుపొందిన పాఠశాలల జట్లకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, స్థానిక ప్రధానోపాధ్యాయుడు లింగన్న, ఎస్సై సీహెచ్.తిరుపతి, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మాజీసర్పంచ్‌లు కాట్‌పల్లి నర్సారెడ్డి, జక్కం బాలకిషన్, మాజీఎంపీటీసీ రూపాల గంగారెడ్డి, కుమ్మరి శీను, దాతలు, ఉపాధ్యాయులు, వ్యాయమ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ కాల్వ మరమ్మతులు చేయాలని వినతి

డొంకేశ్వర్, సెప్టెంబరు 25: డొంకేశ్వర్ లిఫ్ట్ కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని బుధవారం డొంకేశ్వర్ లిఫ్ట్ కమిటీ సభ్యులు కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కాలువను ప్రతీ సంవత్సరం పూడికతీత తీసేందుకు రూ.4లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసి నట్లయితే రైతులకు అదనపు భారం పడకుండా ఉంటుందని తెలిపారు. సాను కూలంగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి, లిఫ్ట్ చైర్మన్ నర్సారెడ్డి, డైరెక్టర్‌లు బార్ల చిన్న గంగారెడ్డి, నాయకుడు లింగన్న, కనకాపురం గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థినులకు దంత పరీక్షలు

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో బుధవారం విద్యారినులకు వైద్యులు దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 650మంది విద్యార్థినులకు డాక్టర్‌లు బారడ్ నవీన్, నిఖిత, సౌమ్యలు వైద్యపరీక్షలు నిర్వహించి లయన్స్ క్లబ్ వారు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, సభ్యులు చెన్న రవికుమార్, గుర్రం విజయానంద్, శశిధర్‌రెడ్డి, అంబల్ల తిరుపతి, శ్రీధర్, పాఠశాల హెచ్‌ఎం వనజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ గ్రీన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. డాక్టర్‌లు సీహర్, సాయిదీప్‌లు 150మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మం దులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ అధ్యక్షుడు పొల్కం వేణు, కార్యదర్శి దాచేపల్లి సంతోష్, అశోక్, నసీరోద్దీన్, గోపికృష్ణ, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థినులకు అభినందన

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: మున్సిపల్ పరిధిలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో పతకాలు సాధించగా వీరిని ఉపాధ్యాయులు అభినందించారు. ఇటీవల నిర్వహించిన అర్బన్ అంతర్ పాఠశాలల క్రీడాపోటీల్లో మార్చ్‌ఫస్ట్ బాలికల విభాగంలో ద్వితీయస్థానం, కబడ్డీ జూనియర్ విభాగంలో ద్వితీయస్థానం, ఖోఖో జూనియర్ విభాగంలో ద్వితీయస్థానం, అలాగే అథ్లెటిక్స్ పోటీల్లో 100మీటర్లు, షాట్‌పూట్, లాంగ్ జంప్ పోటీల్లో ఆరు పతకాలు సాధించిన క్రీడాకారులను బుధవారం కేజీబీవీ పాఠశాలలో వ్యాయమ ఉపాధ్యాయురాలు వీణను పాఠశాల ఇన్‌చార్జీ స్పెషల్ ఆఫీసర్ నవనీత అభినందించారు.

విద్యుత్ అధికారులకు ఘన సన్మానం

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: పట్టణంలోని జిరాయత్‌నగర్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికుల ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ అధికారులను ఘనంగా సన్మానించారు. ఇటీవల బదిలీపై వెళ్ళిన అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, నూతన అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ మోహన్‌లను విద్యుత్ మీటర్ రీడింగ్ కార్మికులు పట్టుశాలువ, మెమోంటోతో సన్మానించారు. కార్యక్రమంలో జేఏవోలు సంజీవ్, పోశెట్టి, ప్రకాష్, హరిష్, సూపర్‌వైజర్ శ్రావణ్, కార్మికులు గంగాధర్, రఫీ, యుసుఫ్, శేఖర్, అజయ్, రాజశేఖర్, వాజిద్, హీనయత్, రేవంత్, సాయి, సోను, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: శిశువులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేసేలా చూడాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గిరిబాబు అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలంలోని ఫత్తేపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ శిశువుకు వ్యాధి నిరోధక టీకాలు అందే విధంగా ముందస్తు జాబితాను సిద్ధం చేసుకొని ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిం చాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు సూచిం చారు. కేంద్రంలో స్టాక్ రిజిష్టర్, రికార్డులను పరిశీలించారు.

ఎంఈవోగా బాధ్యతల స్వీకరణ

మెండోర, సెప్టెంబరు25: నూతన ఎంఈవోగా దేగాం శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న దేగాం శ్రీనివాస్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించడంతో పీఆర్‌టీయు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.పీఆర్‌టీయు నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండల నూతన విద్యాశాఖ అధికారిణిగా టి.రేణుక బాధ్యతలు చేపట్టారు. బుధవారం వేల్పూర్ ఎంఆర్‌సీ భవనంలో పీఆర్‌టీయూ నాయకులు స్వాగత సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత ఎంఈవోగా కొనసాగిన వనజారెడ్డిని, నూతన మండల విద్యాధికారిగా బాధ్యతలు తీసుకున్న రేణుకలను శాలువ, మెమోంటోతో ఘనంగా సన్మానించారు.

మోర్తాడ్ : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మోర్తాడ్ మండల నూతన విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం సమ్మిరెడ్డి తిమ్మాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయునిగా పని చేస్తున్నారు. నోడల్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యత కూడా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్నటువంటి అందరు ఎంఎన్‌వోలను ఎఫ్ఏసీ ఎంఈవోగా నియామించడం జరిగిందని తెలిపారు. బుధవారం మోర్తాడ్ మండల విద్యాధికారిగా సమ్మిరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జక్రాన్‌పల్లి, సెప్టెంబరు 25: మండలంలోని మునిపల్లి గ్రామంలో రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్‌వేస్లీ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. బుధవారం మండలంలోని మునిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం కంపోస్టు షెడ్డును స్థానిక అధికారులను వివరాలు అడిగితెలుసుకున్నారు. కంపోస్టు షెడ్డు వాడకంపై, గ్రామంలో జీపీ అనుమతులో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీఈవో సతీష్‌కుమార్, ఎంఈవో యుసుఫ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి, అధికారులు ఉన్నారు.

‘యువత బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలి’

బోధన్‌రూరల్, సెప్టెంబరు 25: యువత బీజేపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని 91, 92 పోలింగ్‌బూత్‌లలో ఇంటింటికి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు.

‘వర్నిలో మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించాలి’

వర్ని, సెప్టెంబరు 25: వర్ని మండల కేంద్రలో మహిళా డిగ్రీ కళాశాల ప్రారంభించి పేద విద్యార్థులకు విద్యనందించాలని సీపీఎం వర్ని శాఖ మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్నిలో మహాసభ సందర్భంగా పార్టీ నాయకురాలు గాయత్రి పార్టీ జెండా ఆవిష్కరించారు. మూడేళ్ల కాలంలో చేసిన పోరాటాలపై సమీక్ష చేశారు. వర్నిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు చర్చించారు.

పోచారం శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

రుద్రూరు, సెప్టెంబరు 25 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులుగా నియమితులైన పోచారం శ్రీనివాస్‌రెడ్డిని బుధవారం రుద్రూరు మండల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రుద్రూరు మండలానికి ముగ్గురు ఏఎంసీ డైరెక్టర్లను ఇచ్చి న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. రుద్రూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు నడిపింటి నగేష్, చిక్కడపల్లి గ్రామ అధ్యక్షులు దువ్వ రవికుమార్ ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన అదనపు కలెక్టర్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 25: రానున్న గ్రామపంచాయతీ పాలక వర్గం ఎన్నికల దష్యా మండలంలోని కమ్మర్‌పల్లి, ఉప్లూ ర్ గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను అదనపు కలెక్టర్ అంకిత్ బుధవారం సందర్శించి పరిశీలించారు. స్థానిక ఉన్నత పాఠశాలశాలలోని పోలింగ్ కేంద్రాల తరగత గదులను ఆయన సరిశీలించారు. విద్యుత్తు తదితర సమస్యలుంటే సరిచేయించాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేం ద్రాలనుఆయన పరిశీలించారు. అదనపు కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ ఎం అంజనేయులు, ఎంపీడీవో రాజా శ్రీని వాస్, ఆర్ఐలు సతీష్, గంగారాం, ఈజీ ఎస్ టీఏలు, కార్యదర్శి శాంతి కుమార్, ఉపాధ్యాయుడు రాజేశ్వర్ గౌడ్, మండల పరిషత్ కార్యాలయసిబ్బంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

నేడు కమ్మర్‌పల్లిలో అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 25: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో నేటినుంచి మూడురోజుల పాటు మండల స్థాయి అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి ఎన్ ఆంధ్రయ్య, క్రీడల కన్వీనర్ పసుపుల సాయన్న, వ్యాయమ ఉపాధ్యాయుడు నాగభూషణం తెలిపారు ఉదయం 10 గంటలకు అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులతో మార్చ్‌ఫాస్ట్ ఉంటుందన్నారు. మండలంలోని వివిద పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సారథ్యంలో మండలకేంద్రంలోని మినీస్టేడియానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మినీస్టేడియంలో మూడురోజులపాటు జరుగనున్న మండలస్థాయి క్రీడోత్సవాల తొలిరోజు గురువారం ప్రారంభోత్సవానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హాజరుమవుతున్నట్లు మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, మాజీ ఎంపీ టీసీ మైలారం సుధాకర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మినీ స్టేడియంకు చేరుకుని మండల అంతర్ పాఠశాల క్రీడోత్సవాలను ప్రారంభించి క్రీడాకారులు గౌరవ వందనం స్వీకరిస్తారని తెలిపారు. కాగా మండల క్రీడోత్సవాలకు సిద్దమవుతున్న ఆయా పాఠశాలల విద్యార్థులు క్రీడల్లో తర్ఫీదు పొంది సద్దమయ్యారు, కస్తూర్బా పాఠశాల విద్యార్థినులకు దాత దయానంద్ బుధవారం అందజేసిన క్రీడా దుస్తులతో మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీస్ చేశారు.



మార్చ్‌ఫాస్ట్ ప్రాక్టీస్ చేస్తున్న కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు

యాప్‌లో దివ్యాంగ విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

● ఎంఈవో ఎన్ఆంధ్రయ్య

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 25: దివ్యాంగ విద్యార్థులను గుర్తించే నిమిత్తం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రశస్త్ పేర ఒక యాప్‌ను రూపొందించిందని, ఈ యాప్‌ద్వారా మండలంలోని ప్రతీ పాఠశాలలో అంగవైకల్యం గల విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని మండల విద్యాధికారి ఎన్.ఆంధ్రయ్య అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఐఈఆర్‌పీ రాజు ప్రశస్త్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో తల్లిబిడ్డలకు ఆరోగ్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి

రెంజల్, సెప్టెంబరు 25: ఐసీడీఎస్ ద్వారా గర్భిణులు, బాలింత మహిళలకు పౌష్టికాహారంతో తల్లిబిడ్డలకు ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణి అన్నారు. బుధవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో పోషణ మాసం వారోత్సవాలలో భాగంగా గర్భిణీ, బాలింత మహిళలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పోషణ మహోత్సవంలో భాగంగా చిన్న పిల్లలకు అన్నప్రాసన, గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు, గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.

రుద్రూరు : గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఎలాంటి పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో జానకమ్మ పేర్కొన్నారు. బుధవారం రుద్రూరు మండల కేంద్రంలోని సులేమాన్‌నగర్‌లో నిర్వహించిన పోషణ్ అభియాన్ (పోషణమాసం) కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, శిశువులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, పోషకాహార లోపాలపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం లోపం వల్ల రక్తహీనత, జనన, బరువు తగ్గుదల తదితర ఆరోగ్యసమస్యలు ఏర్పడుతాయన్నారు. గర్భిణీ స్త్రీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే తల్లి బిడ్డ ఎలాంటి పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరు ధాన్యాలను తీసుకోవాలన్నారు. పోషకాహార లోపాలను అధిగమించడానికి అంగన్‌వాడీ వర్కర్లు మహిళలలో అవ గాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. బాల్య వివాహాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోషణ అభియాన్ బీసీ కోఆర్డినేటర్ నరేష్, బోధన్ సూపర్వ్ ఆసియా బేగం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీలత, గోపి, లక్ష్మీ, కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఐకేపీ సీఏలుతదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌కు పురస్కారం

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: ఆర్మూర్ ఐసీడీఎస్ పరిధిలోని ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో అంగన్‌వాడి టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న గోలికరుణజ్యోతి ఉత్తమ అంగన్‌వాడి టీచర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి ప్రారంభమైన పోషణ అభియాన్, పోషణ మాసంలో పిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ప్రభుత్వం ఉత్తమ అంగన్‌వాడి టీచర్‌గా గుర్తించింది. బుధవారం నిజామాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి రసూల్‌బీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సేన్

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: ప్రతీ సొసైటీలో రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సెన్ అన్నారు. బుధవారం ఆర్మూర్ మండలంలోని పెర్కిట్, గోవింద్‌పేట్, పిప్రి గ్రామాల సొసైటీలలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఎరువులను గోదాంలో పీవోఎస్ మిషన్‌లో ఉన్న విధంగా ఎరువుల బస్తాలను జిల్లా వ్యవసాయాధికారి పరిశీలించారు. పీవోఎస్ మిషన్‌లో రైతుల ఆధార్‌నెంబర్ ఎంట్రీ చేసిన తర్వాతనే ఎరువులను విక్రయించాలని అన్నారు. రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎరువులను సకాలంలో తెప్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరికృష్ణ, సొసైటీ చైర్మన్‌లు బోజారెడ్డి, మహిపాల్, హేమంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ముప్కాల్ : రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల పంట దిగుబడులను సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్‌హుస్సెన్ తెలిపారు. బుధవారం బాల్కొండ మండలం బోదేపల్లి గ్రామంలో వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతులు సాగు చేస్తున్న పంటలను ప్రతీరోజు విధిగా పరిశీలిస్తూ ఉండాలని, ప్రస్తుల నెలకొన్న వాతావరణ పరిస్థితుల వల్ల వరిలో బ్యాక్టిరియ ఆకు అందు తెగులు, అగ్గితెగులు, సుడిదోమ ఉధృతి ఎక్కువగా అయినట్టు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు కలిసి మండల వారీగా పంటలు పొలాలను పరిశీలించారు. ఆయా మండలాల్లో ఎక్కువ వస్తున్న చీడపీడల యాజమాన్యలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. ఆయనవ వ్యవసాయ విస్తీర్ణ అధికారిణి నిహారిక, రైతులు పాల్గొన్నారు.

నేడు బోధన్‌లో రేషన్ డీలర్లకు పరీక్ష

బోధన్‌రూరల్, సెప్టెంబరు 25: రేషన్ దుకాణాల నిర్వహణ నిమిత్తం అభ్యర్థుల నియామకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గురువారం బోధన్‌లో జరిగే పరీక్ష కేంద్రానికి సమయపాలన పాటించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్ష నిర్వహణ కేంద్రం ఉంటుందన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1:30గంటల వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు అర గంట ముందు పరీక్ష కేంద్రానికి తరలిరావాలని సూచించారు. ఎవరికైన హాల్‌టికెట్ అందని పక్షంలో పరీక్షకేంద్రం వద్ద పొందవచ్చని అన్నారు. పరీక్ష కోసం అన్ని రకాల ఏర్పాట్లు చేశామన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సమాచారం అందించామన్నారు. బోధన్ డివిజన్‌లో 18చోట్ల రేషన్ దుకాణాల నిర్వహణ నిమిత్తం ఖాళీలను పూరించేందుకు ప్రభుత్వం ద్వారా నోటిఫికేషన్ విడుదల అయిందని ఆయన తెలిపారు. రేషన్ దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తుల స్వీకరణ సమయంలో 227మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వీరిలో 180దరఖాస్తులను అంగీకరించినట్లు ఆయన స్పష్టం చేశారు. 47దరఖాస్తుదారులు చేసుకున్న దరఖాస్తులలో వయసు తేడాతో పాటు నిబంధనలు ప్రకారం లేని ఇతర కారణాల వద్ద దరఖాస్తులను తిరస్కరించినట్లు వెల్లడించారు. పరీక్ష నిర్వహణ కోసం నోడల్ అధికారిగా బోధన్ తహసీల్దార్ విఠల్‌ను నియమించినట్లు తెలిపారు. ఇన్విలేటర్‌లు కూడా పరీక్ష పూర్తయ్యేంత వరకు అక్కడే ఉంటారని ఆయన వివరించారు. పరీక్ష సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరు సహ్యాకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ తహసీల్దార్ విఠల్‌తదితరులున్నారు.

రైతు భరోసా ఇవ్వాలని వినతి

ఎడపల్లి, సెప్టెంబర్25: తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రైతులకు ఎకరానికి 15 వేల రూపాయల రైతు భరోసా హామీని ఇచ్చిందని వెంటనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదును జమ చేయాలని కోరుతూ బుధవారం సీపీఐ ఎంఎల్ బోధన్ డివిజన్ నాయకులు గుమ్ముల గంగాధర్ ఆధ్వర్యంలో ఉప తహసీల్దార్ అనూషకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా, రుణమాఫీ కాని రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలని, వృద్ధాప్య ఫించన్ 4 వేలు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు తెలిపారు.

సామాన్యులకే సౌకర్యాలు కరువు : ఎమ్మెల్యే పైడి రాకేష్

నందిపేట, సెప్టెంబరు25: ప్రభుత్వ సాంఘీక సంక్షేమ హాస్టల్‌లో సామాన్యులకే సౌకర్యాలు కరువయ్యాయని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నందిపేట మండలంలోని ఖుద్వాన్‌పూర్ గ్రామంలో ఉన్న ఎస్సీ, బీసీ హాస్టళ్లను అలాగే ప్రభుత్వ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి అల్పార భోజనం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీనెల విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్‌లను సందర్శించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కోరారు. విద్యార్థులను ఉపాధ్యాయులు తమ పిల్లలుగా భావించి సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రపం చంలో అత్యంత గౌరవం ఉన్నది ఉపాధ్యాయులకేనని, వారు సదుపాయాల కల్పన కోసం రూ.100 ఖర్చుపెట్టడంలో తప్పులేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్న సమస్యలపై పోరాటం చేస్తానని, ప్రభుత్వంతో త్వరలోనే మాట్లాడి పాఠశా లలకు భవనాలు, మౌళిక సదుపాయాలు కల్పిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీనాయకులు, హాస్టల్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఆర్మూర్ ఎమ్మెల్యే

ఘనంగా దీన్‌దయాల్ జయంతి

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు 25: దేశం, ధర్మం కోసం పాటుపడిన మహనీయుడు పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను అనుసరించాలని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆర్మూర్ పట్టణంలో పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకొని బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆశయాలను, ఆదర్శాలను ప్రధాని నరేంద్రమోదీ ముందుకు తీసుకువెళ్తున్నారన్నారు. ఇందులో భాగంగానే 370ఆర్టికల్ రద్దు చేయడం, సబ్‌కా సత్ సబ్‌కా వికాస్ ఆలో చనతో ముందుకు వెళ్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్, జెస్సు అనిల్, ద్యాగ ఉదయ్, ఆకుల రాజు, పొల్కం వేణు, ఆకుల శ్రీనివాస్, నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ కార్య కర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రుద్రూరు : దీన్‌దయాల్ ఉపాధ్యాయుడి స్ఫూర్తితో ముందుకు సాగుదామని బీజేపీ మండల అధ్యక్షుడు అలపాటి హరికృష్ణ పేర్కొన్నారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ 108వ జయంతిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దయాళ్ నాయకత్వం, సేవాభావం, పార్టీ కోసం చేసిన కృషిని కొనియాడారు. వారి అడుగు జాడల్లో ప్రతి ఒక్కరు పని చేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయన రచించిన సిద్ధాంతాలనే ఆదర్శంగా తీసుకుని కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్టత కొరకు పాటుపడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్

● డీఐఈవో రవికుమార్

కోట్యాగిరి, సెప్టెంబరు 25: ప్రతి విద్యార్థికి ఇంటర్మీడియట్ ఎంతో కీలకమని, కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవికుమార్ పేర్కొన్నారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం డీఐఈవో తనిఖీ చేశారు. కళాశాలలో పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సూచించారు. ఎంసెట్ బోధించాలని అధ్యాపకులకు సూచించారు. సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రాక్టీకల్స్ రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. ప్రతి విద్యార్థి స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధ్యాపకులు కృషి చేయాలన్నారు. కళాశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్‌తో ముగ్గురు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కైసర్ పాషా, అధ్యాపకులు దత్తాత్రి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

జన్నేపల్లిలో తాళం వేసిన ఇంట్లో చోరీ

నవీపేట, సెప్టెంబరు 25: మండలంలోని జన్నేపల్లిలో వల్లూరి సురేష్ బాబుకు చెందిన ఇంట్లో చోరీ జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. సురేష్ బాబు తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 10న హైదరాబాద్‌కు వెళ్లారని బుధవారం పని మనిషి సుబ్బమ్మ ఇంటికి శుభ్రం చేయడానికి రాగా వెనుక తలుపు తాళం పగిలి ఉందన్నారు. ఈ విషయాన్ని ఆమె కుటుంబ యాజమానికి ఫోన్‌లో వివరించగా మధ్యాహ్నం వచ్చిన కుటుంబ సభ్యులు ఇంటిని పరిశీలించారు. ఇంటి లోపల గుర్తుతెలియని దొంగలు బీరువాతో పాటు ఇతర వస్తువులను ధ్వంసం చేశారని, లోపల ఉన్న నాలుగున్నర తులాల బంగారం, 36 తులాల వెండితో పాటు 30వేల రూపాయల నగదును ఎత్తుకెళ్లారని ఆయన పేర్కొన్నారు, సంఘటన స్థలాన్ని క్లూస్ టీమ్ సభ్యులు పరిశీలించి ఆధారాలను సేకరించడం జరిగిందని అన్నారు. సురేష్ బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

రెంజల్, సెప్టెంబరు 25: మండలంలోని కందకుర్తి గోదావరి వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్ఐ సాయన్న తెలిపారు. మృతుడి వయసు 25 నుంచి 30 సంవత్సరాల వరకు ఉంటుందని మృతుడు చామన్‌చాయ అని, శరీరంపై ధరించిన టీషర్ట్‌పై శంకర్ ఇంజనీరింగ్ కేరాఫ్ నిజామాబాద్ అని రాసి ఉందని ఎవరికైనా వివరాలు తెలిస్తే రెంజల్ పోలీసులకు ఫోన్ నెంబర్ 8712659874 ఫోన్‌కు సమాచారం అందించాలని ఎస్ఐ సాయన్న కోరారు.

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

రుద్రూరు, సెప్టెంబరు 25 : స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా రుద్రూరు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో బుధవారం రుద్రూరు, అక్బర్‌నగర్, అంబం (ఆర్) గ్రామాలకు చెందిన పారిశుధ్య కార్మికులకు వైద్యాధికారిణి ఆయేషా సిద్దిఖీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీడీవో సురేష్‌బాబు మాట్లాడుతూ వివిధ గ్రామాల్లో పనిచేసే కార్మికులు తమ ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం గ్రామ పంచాయతీల కార్యదర్శులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికులు గ్రామాల్లో చేసే సేవలు మరువలేనివన్నారు. అదేవిధంగా పరిసరాల పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, గంగారాం, సూపర్ వైజర్‌లు రవి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్ని: మండల కేంద్రంలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బంది(ఎంపీడబ్ల్యూఎస్)కు వర్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కమిషనర్

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 25: మున్సిపల్ పరిధిలోని డంపింగ్‌యార్డులో బుధవారం కమిషనర్ రాజు మొక్కలను నాటారు. స్వచ్ఛతా సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సం రక్షించే బాధ్యతను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

దూరవిద్య దరఖాస్తుకు గడువు పెంపు

భీమ్‌గల్ సెప్టెంబరు 25: డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య యందు 2024-25సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు పొందెందుకు ఈనెల 30వ తేదీ వరకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ తెలిపారు. ఇంటర్మీడీయేట్ పూర్తి అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని ఏలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 30తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఇందుకు పూర్తి సమాచారం కోసం 9948581970నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన మాదిగ దండోరా నాయకులు

ఎడపల్లి, సెప్టెంబర్ 25: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలోగల మాదిగ దండోరా సంఘ సభ్యులు బుదవారం స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి మక్క చేనుల గురించి వినతిపత్రం అందించారు. అనంతరం వారు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ నాయకులు విజయ్ గౌడ్, మాదిగ దండోరా సంఘ సభ్యులు తదితరులు ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వినతి

ఎడపల్లి, సెప్టెంబర్25: 60సంవత్సరాలు పైబడిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ బుధవారం ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్‌కు ఎడపల్లి వీఆర్ఏల వారసులు బోధన్ డివిజన్ అధ్యక్షుడు కరుణాకర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ అధ్యక్షులు కరుణాకర్, మండలాల అధ్యక్షులు రత్నాకర్, శివ, అబ్బులు తదితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లి : జక్రాన్‌పల్లిలో వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరుతూ తహసీల్దార్ కిరాణ్మాయికి వీఆర్ఏలు వినతిపత్రం అందజేశారు. వీఆర్ఏల వారసులకు జీవో నెంబర్ 81, 85ప్రకారం నియామక ఉత్తర్వులు ఇప్పించి వీఆర్ఏల కుటుంబాలను ఆదుకోవాని తహసీల్దార్‌కు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వీఆర్ఏల సంఘం అధ్యక్షుడు తలారి లక్ష్మణ్, వీఆర్ఏలు మధు, శంకర్, చంద్రశేఖర్, నరేందర్, అనంత్‌రావు, రాములు, రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులు సమన్వయంతో విధులు నిర్వహించాలి

బోధన్‌రూరల్, సెప్టెంబరు 25: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఫార్మాసిస్టులు సమన్వయంతో విధులు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను అందజేయాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విఠల్ రాజ్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంటర్నేషనల్ ఫార్మాసిస్టు డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మాసిస్టులు రోగులకు అవసరమైన మందులను సమన్వయంతో అందించాలన్నారు. వైద్యులు సూచించిన మందులను వ్యాధిగ్రస్తులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది రామకృష్ణ, అభిలాష్, హరికృష్ణ, కిరణ్ రాజ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ మినీస్టేడియానికి రూ.51వేల విరాళం

ముప్కాల్, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో నిర్మాణమవుతున్న ఇండోర్ స్టేడియం కోసం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బద్దం నర్సారెడ్డి తనవంతు సహాయంగా రూ.51వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఇండోర్ స్టేడియం నిర్వాహకులు బద్దం నర్సారెడ్డిని సన్మానించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో రిటైర్డు ఉద్యోగులు నునుగు అంజయ్య, డి.సాయన్న, మోతె గంగారెడ్డి, గంగారాం, సంజీవ్, ప్రవీన్, నవీన్, దినేష్, హరిష్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం


ప్రశంసాపత్రాలతో ఉత్తమ ఉపాధ్యాయులు

ఇందల్వాయి, సెప్టెంబరు 25: మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను బుధవారం సన్మానించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న అత్యుత్తమ బోధన చేస్తున్న 25 మంది ఉపాధ్యాయులను మండల విద్యాధికారి సేవుల, నోడల్ అధికారి శ్రీధర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సన్మానించారు. మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కంఠం భార్గవ, శ్రీనివాస్‌లు, బీసీటీయూ జిల్లా అధ్యక్షులు మాడవీడి వినోద్, గంగామోహన్, యూటీఎఫ్ పవన్, టీపీయూ ఎస్ గంగాప్రసాద్, ఎస్సీ ఎస్టీ టీచర్స్ యూనియన్ నితిన్, గం గాధర్, జస్ట్ సుధీర్ ఎస్‌జీటీ యూనియన్ ఇంద్రకరణ్ పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న మహిళల అరెస్టు

ఖిల్లా, సెప్టెంబరు 25 : నగరంలోని ఒకటోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు సరస్వతినగర్‌లోని ఓ ఇంటిపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న మహిళలను గుర్తించారు. వారి వద్ద నుంచి 15వేల 100 రూపాయలను, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ అధికార ప్రతినిధిగా శంకర్‌రెడ్డి

మోపాల్, సెప్టెంబరు 25: భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ జిల్లా సంస్థాగత నిర్మాణంలో భాగంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా నిజామాబాద్ రూరల్ మండలం గుండారం గ్రామానికి చెందిన శంకర్‌రెడ్డిని నియమించారు. బుధవారం పార్టీ అధ్యక్షుడు దినేష్ కులాచారి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

మోపాల్, సెప్టెంబరు 25 : నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్పగంగారెడ్డి నియమించడంతో బుధవారం రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. గంగారెడ్డితో పాటు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కూడా సన్మానించారు. సన్మానించిన వారిలో డిచ్‌పల్లి నాయకులు కంచెట్టి గంగాధర్‌తో పాటు మండల పార్టీ నాయకులు, తదితరులున్నారు. అదే విధంగా మోపా ల్ మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సఫాయి కార్మికులకు డ్రెస్సులు, గ్లౌజుల పంపిణీ

ధర్పల్లి, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో గల గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులకు ఎపీపీడీవో బాలకృష్ణ గ్లౌజులు, డ్రెస్సులు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామ పంచాయతీకి చెందిన సఫాయి కార్మికులు, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషియన్‌లకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి కార్మికుల ఆరోగ్య పరిరక్షణ కోసం వీటిని అందజేసినట్లు చెప్పారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేసే సఫాయి కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్, ఈవో సైఫొద్దీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు సామాగ్రిని అందజేసిన రోటరీక్లబ్ సభ్యులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25: ఎన్ని ఆటంకాలైన చదువును ఆపొద్దని చదువు లేకుంటే భవిత శూన్యమని రోటరీక్లబ్ ఆఫ్ అధ్యక్షుడు బీరెల్లి విజయరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని శివాజీనగర్‌లో గల ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థుల ఉపయోగార్థం 40 లీటర్ల స్టీల్ ట్యాంక్, 100 గ్లాసులు, 2 డొంగాలు, 160 మంది విద్యార్థులకు సరిపోయే స్టేషనరీ సామగ్రిని అందజేశారు. కార్యక్రమానికి అగ్రసేన్ మహిళా మండలి సభ్యులు 10 వేల విలువైన సామగ్రిని అందజేశారు.

సిరికొండ ఎంఈవోగా రాములు బాధ్యతలు స్వీకరణ

సిరికొండ,సెప్టెంబరు 25: సిరికొండ మండల విద్యాధికారిగా తూంపల్లి జడ్పీహెచ్‌ఎస్ పీజీ హెచ్‌ఎం పూసల రాములు నియమితులయ్యారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని విద్యా వనరుల అభివృద్ధి కార్యాలయంలో ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

డిచ్‌పల్లి : మండల విద్యాధికారిగా యానం పల్లి జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం డిచ్‌పల్లి ఎంఈవోగా ఉన్న రాజగంగారంను ఆర్మూర్‌కు బదిలీ చేశారు.

పోలీసు సిబ్బందికి డ్యూటీమీట్


పోలీసు డ్యూటీ మీట్ పోటీను పరిశీలిస్తున్న సీపీ

ఖిల్లా, సెప్టెంబరు 25 : పోలీసు డ్యూటీ మీట్‌లో భాగంగా సిబ్బందికి వివిధ రంగాల్లో పోటీలను పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ బుధవారం నిర్వహించారు. ఈ పోటీల ద్వారా పోలీసు విభాగంలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఏసీపీ స్థాయి వరకు పని పద్ధతులు మెరుగుపడి విచారణ స్థాయిలు పెరుగుతాయన్నారు. పనిలో పోటీతత్వం అలవాటుపడుతుందన్నారు. సైంటిఫిక్ ఇన్విస్టేగేషన్, ఫింగర్‌ప్రింట్ ఇన్వేష్టిగేషన్ కోసం ఎంపికలో బాగంగా ఈ పోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. పోలీసు కమీషనరేట్ పరిధిలో నేరాలు జరిగినప్పుడు నేర స్థలంలో సేకరించవలసిన నేర సమాచారం కోసం పోలీసు క్లూస్ ఏ విధంగా సేకరించాలనేదని కోసం ఎంపిక పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇందులో ప్రతిభ కనపర్చిన వారికి రాష్ట్రస్థాయిలో జరిగే డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావ్, సీసీఎస్ ఏసీపీ. నాగవేంద్రచారీ, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ట్రైనీ ఎస్‌ఐలకు అభినందన..

ఖిల్లా : శిక్షణ పూర్తి చేసుకున్న 8మంది ట్రైనీ ఎస్‌ఐలు పోలీసుకమిషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ వారికి పుష్పగుచ్ఛం అందించి అభినందనించారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ హైదరాబాద్‌లో సంవత్సరం శిక్షణ పూర్తి చేసుకుని బాసర జోన్-2 పరిధిలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సిబ్బంది ఎల్లప్పుడు మంచి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. తమ పై స్థాయి అధికారుల సూచనలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించాలన్నారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పం దించాలన్నారు.

కానిస్టేబుల్‌ను సన్మానించిన సీపీ

విధుల్లో ఉండి అనుమానితులను గుర్తించిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను బుధవారం పోలీసు కమీషనర్ కల్మేశ్వర్‌సింగనేవార్ సన్మానించారు. ఈనెల 23న సాయంత్రం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని బైపాస్ చౌరస్తా వద్ద ఎం.అబ్బులు విధులు నిర్వహిస్తున్న సమయంలో సిగ్నల్ జంప్ చేసి కారు వేగంగా వెళ్లడాన్ని గమనించాడు. వెంటనే ఆకారును ఆపగా అందులో నుంచి దిగిన డ్రైవర్ వాహనంలో ఉన్న వ్యక్తికి ఆరోగ్యం బాగలేదని ఆస్పత్రికి తరలిస్తున్నామని చెప్పాడు. అనుమానం వచ్చి అందులో చూడగా అందులో కత్తులు, తల్వార్లు ఉండడాన్ని గమనించారు. కారు డ్రైవర్ కారును వదిలి పరారయ్యాడు. కారులో ఉన్న ఇద్దరు అనుమానితులను పట్టుకుని కారును, ఇద్దరిని రూరల్ పోలీసులకు అప్పగించారు. అనుమానితులతో పాటు కత్తులు, తల్వార్‌లను పోలీసులకు అప్పగించడంతో ఆయనను సీపీ సన్మానించారు. మిగతా సిబ్బంది అబ్బులును స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీ సూచించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ కోటేశ్వర్‌రావ్, ట్రాఫిక్ ఏసీపీ నారాయణలు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుంది

● బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి


బహుమతులు అందజేస్తున్న సుదర్శన్‌రెడ్డి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25: కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, గత ప్రభుత్వం క్రీడలను నిర్వహించకపోవడంతో క్రీడాకారులు చాలా నష్టపోయారని బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి అన్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఎస్ స్మారక క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం క్రీడలను, స్టేడియాలను పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన స్టేడియాల నిర్మాణంపై దృష్టి సారించామన్నారు. నిజామాబాద్ నగరంలో అత్యాధునిక స్టేడియాన్ని నిర్మిస్తామన్నారు. ప్రభుత్వపాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఇప్పటికే మరమ్మతులు నిర్వహించామన్నారు. డి.శ్రీనివాస్ తనకు అత్యంత సన్నిహితుడు అని అన్నారు. డి.శ్రీనివాస్ హయాంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తుచేశారు. అనంతరం నగర మాజీ మేయర్ సంజయ్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించేందుకే ఈ స్మారక పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వివిధ పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అం దజేశారు. ఖోఖో బాలుర జూనియర్ విభాగంలో మొదటి స్థానంలో పోచంపాడ్ గెలుపొందగా, చం దూర్ రెండోస్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో దాస్‌నగర్ మహాత్మ జ్యోతిబాపూలే మొదటి స్థానంలో నిలువగా, పోచంపాడ్ టీజీఎ స్‌డబ్ల్యుఆర్‌ఎస్ రెండోస్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, మార్కెట్ కమిటీ చైర్మన్ నగేష్‌రెడ్డి, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వేణురాజ్, పీఈటీల సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్, నిజామాబాద్ స్పోర్ట్స్ ప్రమోషన్ సొసైటీ సభ్యుడు డి.సాయిలు పాల్గొన్నారు.

కామర్స్ విభాగంలో సెమినార్

డిచ్‌పల్లి, సెప్టెంబరు 25: తెలంగాణ విశ్వవిద్యాలయం లోని కామర్స్ విభాగంలో క్లిక్ లెర్న్ టీచ్ ట్యాలీ ప్రైమ్ అనే అంశంపై కార్యశాల జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ.. అకౌంట్ లో మారుతున్న కాలానికి అనుగుణంగా అధ్యాపకులు అందరు పరిజానం పెంపొందించుకోవాని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో అకౌటింగ్ సాఫ్ట్ వేర్ యొక్క ప్రాముఖ్యత తెలిపారు. ఈ కార్యక్రమానికి పలు కళాశాలల అధ్యాపకులు, అధ్యాపకేతరులు ప్రోగ్రాం కన్వీనర్ శ్రీనివాస్, శ్వేతా, గంగాధర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులతో ఈడీ సమీక్ష

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25:ఆర్టీసి జిల్లా అధికారులతో ఈడి హైదరాబాద్ మునిశేఖర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎం కార్యాలయ ఆవరణలో రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడి మునిశేఖర్ మాట్లాడుతూ రీజియన్ పరిధిలోని అన్ని డిపోలలో రాబడిని పెంచాలని కోరారు. అంతకుముందు నగరంలోని డిపో-2, డిపో-1లను తనిఖీలు నిర్వహించారు. మేనేజర్‌లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎం జానిరెడ్డి, డిపోల మేనేజర్లు ఆనంద్, సాయన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఏళ్ల జైలు

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 25: కులం పేరుతో దళితురాలిని దూషించిన వ్యక్తికి మూడు ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ రెండో అదనపు జిల్లా జడ్జి, స్పెషల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి టి.శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... నగరంలోని ఖిల్లారోడ్‌కు చెందిన కొట్టాల్ల కార్తిక్ గాజుల్‌పేట్‌కు చెందిన అనాపతె ఇంద్రాబాయి ఇంటికి 3-8-2023న రాత్రి వెళ్లి ఆమె కొడుకు రాందాస్ తనకు మూడువేలు బాకీ ఉన్నాడని, ఇవ్వడం లేదని గొడవ చేసి, ఆమెపై దాడి చేసి, కులం పేరుతో దూషించి దుర్భాషలాడాడు. రెండోటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా పీపీ బంటు వసంత్ పోలీసువారి తరపున వాదించారు. కేసును పరిశీలించిన స్పెషల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి ముద్దాయికి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ అదనంగా 8వేల రూపాయల జరిమానా, చెల్లించకపోతే మరో ఆరునెలల జైలు శిక్ష విధించాలని తీర్పుచెప్పారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం పొలం బాట

డిచ్‌పల్లి, సెప్టెంబరు 23: విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతుల వ్యవసాయ కరెంట్, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యల పరిష్కారం కో సం డిచ్‌పల్లి ఏఈ సాయిలు ఆధ్వర్యంలో విద్యుత్ సిబ్బంది పొలంబాట నిర్వహించారు. బుధవారం వారు ఖిల్లా డిచ్‌పల్లిలో రైతుల పొలాల్లోకి వెళ్లి రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించారు.

పాండిచ్చేరి వర్క్‌షాప్‌కు హాజరైన డిఈవో

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: పాండిచ్చేరిలో గత రెండు రోజులుగా ఎన్‌సిఈసిఆర్ నిర్వహిస్తున్న రిజీనల్ వర్క్‌షాప్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.వి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో మధ్యలోనే చదువు మానేస్తున్న విద్యార్థుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వర్క్‌షాప్‌లో చర్చ జరిగినట్లు తెలిసింది. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిపుణులు సూచించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఐదుగురు జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనగా జిల్లా నుంచి డిఈవో పాల్గొన్నారు. శుక్రవారం వరకు ఈ వర్క్‌షాప్ జరుగనుంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఇందల్వాయి, సెప్టెంబరు 25:ఇందల్వాయి మండలంలోని గంగారాం తాండా పరిధిలో అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 7 క్వింటాళ్ల 73 కిలోల పిడిఎస్ బియ్యం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపారు. వారికి అందిన సమాచారం ప్రకారం గంగారాం తాండాలో పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలియడంతో సంబంధిత వ్యాన్‌ను పట్టుకొని కేసు నమోదు చేసి ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌కు తరలించామని సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ పిఎస్ మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సభ్యులు వినోద్, ఇందల్వాయి ఎస్సై మహేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పీడీఎస్‌యూ పోస్టర్ల ఆవిష్కరణ

డిచ్‌పల్లి, సెప్టెంబరు 25: అక్టోబరు 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియం లో జరిగే పీడీఎస్‌యూ అర్థశ తాబ్దపు సభను విజయవంతం చేయాలని బుధవారం వర్సిటీ బాయ్స్ హస్టల్ ఎదుట పీడీఎస్‌యూ నాయకులు పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. గత 50ఏళ్ల కాలంలో పీడీఎస్‌యూ విద్యారంగ సమస్యలపై శాస్త్రీయ విద్యాసాధనకై సమ సమాజ స్థాపనకై నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం, విద్యా ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘం పోరాడిందన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ లో నాయకులు రాకేశ్, పాండు, నిరాజ్, రాము, సాయి, మహేశ్, వికాస్, శివా, పాల్గొన్నారు.

రోడ్డు నివారణ ప్రమాదాలపై అవగాహన

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25:ఎన్‌సిసి క్యాడెట్లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని రాజారాం స్టేడియంలో 12వ బెటాలియన్ ఆధ్వర్యంలో అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం వల్ల ప్రమాదాలు జరగవన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి క్యాడెట్లు, ట్రాఫిక్ కానిస్టేబుల్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో దీన్‌దయాల్ జయంతి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 25: నగరంలోని మారుతినగర్‌లో గల స్నేహసొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో పండిత్ దీన్‌దయాల్ జయంతి కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, ఏసి విజయ్‌భాస్కర్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులతో సమీక్ష

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25: ట్రాన్స్‌ఫార్మర్ ఫెల్యూర్స్ లేకుండా చూడాలని టీజీఎన్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయం ఆవరణలో విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ అశోక్ మాట్లాడుతూ డీటీఆర్ రిపేర్‌లలో నాణ్యత పాటించాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ ఫెల్యూర్‌లు పెరగకుండా చూసుకోవాలన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు యువకుల ఆత్మహత్య


మృతుడు అజయ్ ఫైల్


చాకలి రాము మృతదేహం

ఇందల్వాయి, సెప్టెంబరు 25:ప్రేమించిన యువతి నిరాకరించిందని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇందల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సిర్నాపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సిర్నాపల్లి గ్రామానికి చెందిన ఒన్నాజిపేట అజయ్ (21) యువకుడు హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో పలు ఇంటర్వ్యూలకు వెళ్లడంతో ఓ యువతితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారడంతో తరచూ ఇద్దరూ మాట్లాడుకునే వారని ఈ విషయం ఇంట్లో వారికి తెలియడంతో వారికి పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు అబ్బాయితో మాట్లాడినట్లు తెలిసింది. అజయ్ అన్న పెళ్లి చేసిన తర్వాత అమ్మాయిని ఒప్పించి తన పెళ్లి చేస్తామని కుటుంబ సభ్యులు చెప్పినప్పటికీ ఇప్పుడే తాను పెళ్లిచేసుకుంటానని కు టుంబ సభ్యులకు చెప్పాడన్నారు. ఈ క్రమంలో.. ఈనెల 10న పురుగుల మం దు తాగాడు. మూడురోజుల పాటు ఇం ట్లో వారికి చెప్పకుండా కడుపునొప్పి వస్తుందని తరచూ వాంతులు చేసుకుంటుండటంతో అతన్ని ఈనెల 13న ఇందల్వాయి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స అందించారు. పది రోజులుగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మరోవైపు మృతుడు పురుగుల మందు తాగే వీడియోను తన సెల్‌ఫోన్‌లో రికార్డ్ చేసినట్లు తెలిసింది. అమ్మాయి కోసమే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

జీవితంపై విరక్తితో...

జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇందల్వాయి మండలంలోని లింగాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం లింగాపూర్ గ్రామానికి చెందిన చాకలి రాము (27) గత పది సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో అతని కాలులో రాడ్డు వేసినట్లు తెలిపారు. అప్పటి నుంచి ఏ పని చేయలేని స్థితిలో ఉం డిపోయాడు. ఈనెల 20న వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడని గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నిజామాబాద్ లీగల్, సెప్టెంబరు 25 :హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ బుధవారం జిల్లా సెషన్స్ జడ్జి సునీతకుంచాల తీర్పు చెప్పారు. వివరాలకు వెళ్తే.... భూవివాదంలో రిటైర్డ్ పోలీసు హెడ్‌కానిస్టేబుల్ తన ఇంటి ఎదురుగా ఉన్న కొక్కొండ రాంప్రసాద్, గోనిశెట్టి గంగామల్లుకు తరుచూ ఘర్షణ జరిగేది. వీరి ఇండ్ల మధ్య రోడ్డు ఇరుకుగా ఉండడంతో గంగమల్లుకు చెందిన గొర్రెలు, మేకలు ఇంటి ముందు ఉంచడంతో రాంప్రసాద్ వారి వాహనాలను పార్కింగ్‌లో ఇబ్బంది అవుతుందని తరుచు ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఈ విషయంపై దీర్ఘకాలికంగా గొడవలు జరుగుతుండడంతో 25ఫిబ్రవరి 2022న బంధువుల పెళ్లికి వెళ్లిన రాంప్రసాద్ తిరిగి సాయంత్రం ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో ఇరువురు కలుసుకుని తిరిగి వాగ్వాదానికి దిగారు. రాంప్రసాద్‌ను హత్యచేస్తే శాశ్వత పరిష్కారం దొరుకుతుందని భావించిన గంగమల్లు తన వద్ద ఉన్న కర్రతో బైక్‌పై ఉన్న రాంప్రసాద్ తలపై బలంగా కొట్టగా ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి రూరల్ ఇన్‌స్పెక్టర్ జగదం సురేష్ కేసుకు సంబంధించిన వివరాలను కోర్టులో దాఖలు చేశారు. పోలీసు వారి తరపున పీపీ రవిరాజ్ వాదించగా జిల్లా సెషన్స్ జడ్జి ముద్దాయికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ, అదనంగా రెండు వేలు రూపాయలు చెల్లించాలని తీర్పు చెప్పారు. చెల్లించకపోతే మరో ఆరు నెలల జైలుశిక్ష విధించారు.

ఈనెల 28న అండర్-17 ఫుట్‌బాల్ ఎంపికలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 25: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల ఎంపికలు ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని నాగారం స్టేడియంలో ఈ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలబాలికలు 1-1-2008 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. క్రీడాకారులు బోనాఫైడ్ సర్టిఫికెట్‌ను వెంటతెచ్చుకోవాలన్నారు. ఉదయం 10 గంటల లోపు మైదానానికి చేరుకోవాలని మిగతా వివరాల కోసం 9347216426 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రెజ్లింగ్ ఉమ్మడి జిల్లాల ఎంపికలు...

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న రెజ్లింగ్ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్ జీఎఫ్ సెక్రెటరీ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగంలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మోపాల్ మండలం మంచిప్ప జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఈ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14, 17లో వివిధ కిలోల కేటగిరిలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాల కోసం 7893732228, 9550358444 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	: రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.77500	రూ.71500	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : ఫైలం పిలగా (1.15)
: మత్తు వదలరా-2 (4.00, 7.00, 10.00)
స్క్రీన్-2 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (3డి ఇంగ్లీష్) (11.00, 4.35)
: యుద్ర (హిందీ) (1.30, 7.05)
: గొర్రె పురాణం (10.10)
స్క్రీన్-3 : మత్తు వదలరా-2 (12.50)
: సరిపోదా శనివారం (3.50, 10.30)
: యుద్ర (హిందీ) (7.25)
స్క్రీన్-4 : చీక్‌లెట్స్ (తెలుగు) (10.25)
: తుంబ్బడ్ (హిందీ) (1.05)
: మనం (3.45)
: మాయాబజార్ (7.10)
: స్త్రీ-2 (హిందీ) (11.00)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : 35-చిన్నకథ కాదు (4.30)
: మత్తు వదలరా-2 (7.20, 10.25)
స్క్రీన్-2 : సరిపోదా శనివారం (1.30, 7.25)
స్క్రీన్-3 : ట్రాన్స్‌ఫార్మర్స్-1 (ఇంగ్లీష్ 3డి) (11.00, 4.40, 10.35)

దేవి : మత్తు వదలరా-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: యుద్ర (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్: బొమ్మరిల్లు (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్